

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## చి. బొ. శ్రీ . ర

ఓ శనివారప్పొద్దు. పొద్దంటే పన్నెండుకి అటే. ఆరోజు యే బంధుమిత్ర పరివారమూ వాళ్ళని పిలిచి ఇబ్బందిపెట్టని కారణాన, ఏరి కోరి వండించుకున్న భోజనం ఆవురావురంటూ తింటున్నాడు సూర్యం. ఆరాధనాభావంతో వడ్డిస్తోంది అరవింద. వేయించిన కందిపప్పుతో ముద్దపప్పు, ఇంట్లో కాచిన నెయ్యితో ఒక రౌండు పూర్తయ్యింది. ఇక అతిముఖ్యమైన సమయం ఆసన్నమైంది. ఆ సమయంలో సూర్యం ఒక ధ్యాన ముద్రలోకి వెళిపోతాడు. అతని చేతులు అన్నం కలుపుతూంటాయి. నోరు తింటూ వుంటుంది. మనసు మాత్రం ఒక తెలియని అనుభూతి చెందుతూ, పంచభూతాలనీ పలకరిస్తూంటుంది. అతను బాసుమతీ అన్నం వాయమీద కాస్త పప్పునూనె చిలకరించి, బంగారు గుళికెల్లాంటి, వేగిన బంగాళదుంప ముక్కల్ని జాగ్రత్తగా అన్నంలోకి లాగి, ప్రేమగా కలుపుతున్నాడు. అతని వేళ్ళు శిల్పాన్ని చెక్కే జక్కన్న చేతి వేళ్ళలా చక్కని నైపుణ్యంతో చక చకా కదులుతూ, ఆ అన్నాన్ని చిన్న ముద్దలు కట్టి నోటికందిస్తున్నాయి. అతను ఓ ముద్ద ఆరగించి "ఆహా, ఈ బంగాళదుంపే లేకపోతే ప్రపంచం ఏమైపోనో. సముద్రంలో వున్న భూదేవిని వెలికితీసిన విష్ణుమూర్తే మానవులకోసం, భూమిలోపల పండే బంగాళదుంపని కూడా పైకి తీసిచ్చుంటాడు తినండ్రాఅని. అసలు మన పురాణేతి హాసాలనిండా బంగాళదుంపేకదా. పెళ్ళికి గొడ్డలిపట్టుకొచ్చిన పరశురాముడి కోపం ఎలా తీరిందీ? జనకుడి విందులో వడ్డించిన స్పెషలైటెం బంగాళదుంపల వేపుడువల్లనే కదా. మరి నరసింహస్వామిని ప్రహ్లాదుడెలా శాంతపరిచాడు?, సేండిటో. మరి కురుక్షేత్రంలో కృష్ణుడు భగవద్గీత చెబుతున్నంతసేపూ కౌరవులూ వాళ్ళ చెంచాలూ బాణాలెందుకెయ్యలేదూ? అది ధర్మరాజుగారి స్పెషలేరేంజిమెంటు. - ఆకౌరవులకి ఫ్రెంచి ఫ్రైసూ, హేష్ బ్రౌన్సూ కెటిల్ ఫ్రైడు చిప్సూ, బంగాళదుంపల వేపుడూ గట్రా స్నాక్స్ ఇవ్వమని తతిమ్మా ముగ్గురు తమ్ముళ్ళకీ ఆర్డరేసాడు అన్నగారు. వాళ్ళు ఫాలో అయిపోయారు. కౌరవుల రోగం కుదిరిపోయింది. ఆతరువాత "అశ్వత్థామ హతః అయినా, ఆచార్యుడే హతః అయినా" వాళ్ళు పట్టించుకునే స్టేజిలో లేరు. వాళ్ళు తీరిగ్గా వేళ్ళునాక్కుంటూంటే, వీళ్ళిట్నించి బాణాలేసేసి "గెలిచేసామోచ్" అన్నారు. అలా ధరణిలో ధర్మం నిలిపింది బంగాళదుంప" ..చెప్పుకుపోతున్నాడు సూర్యం.

ఇంక లాభంలేదని గ్రహించి, నెయ్యికప్పు ఓమాటు కాస్త వేడిచేసి తీసుకొచ్చి చురుక్కుమనిపించింది అరవింద. గబుక్కుమని మళ్ళీ ఈ లోకంలోకొచ్చి "మరదే, సరసవంటే.., నేను ఒకదివ్యోపదేశం చేస్తున్నప్పుడు విని అర్థంచేసుకోవాలి. ముఖ్యంగా మీ

ఆడవాళ్ళు బంగాళదుంపల వేపుడు నందికేశుడి నోము పట్టాలి. నాలాంటివాళ్ళని పిలిస్తే ఫలితం దక్కుతుంది, సూక్ష్మం గ్రహించు" చెప్పాడు సూర్యం.

"అసలు మిమ్మల్నికాదు, మా నాన్నని అనాలి, మీలాంటి సాపాటు రామన్నతో ముడిపెట్టినందుకు.." అంది కోపంగా నవ్వాపుకుంటూ.

"మరదే తినగలగడం ఒక యోగం, తినడం ఒక భోగం" అన్నాడు సూర్యం. ఇంతలో ఫోను మోగింది. సత్యం అండ్ కో. సాయంత్రం వస్తున్నామనిచెప్పి పెట్టేసారు. సాయంత్రం కాగానే వచ్చేసారు.

వంటింట్లో పూరీలొత్తుతోంది అరవింద. పక్కనే నించుని చూస్తోంది సావిత్రి. ఒక్కసారి "అయ్యబాబోయ్.."అంటూ కెవ్వుమంది. ఉలిక్కిపడింది అరవింద.

"ఏవైందే, అలా అరిచావూ?" అంది.

"నువ్వు, నువ్వు నూనె వాడతావా?" అంది సావిత్రి కోపంగా.

"అవునూ, ఏం, నెయ్యైతే బెటరంటావా?"

"హ్ర..వీహిం..దా, సర్లే, ఏనూనె?" మళ్ళీ అడిగింది సావిత్రి ఊగిపోతూ.

"చేతిమీదకి పప్పునూని, మూకుట్లోకి వెజిటబుల్ ఆయిలూ"

"వె..హి..ఝి..ఠీ..బు..ల్ హాయిలా" అంది కళ్ళింత పెద్దవి చేసి.

"కాదు, వెజిటబుల్ ఆయిలు" అంది అరవింద అమాయకంగా.

"అదే, అదే ఆమాటే వినబడకూడదు" అంది సావిత్రి కుమిలిపోతూ. అర్థంకాలేదు అరవిందకి. కాసిన్ని మంచినీళ్ళిచ్చి, స్థిమితంగా కూచోబెట్టి అడిగింది విషయం ఏవిటని? సావిత్రి మొదలెట్టింది. "నూనె, నెయ్యిలలో కొలెస్ట్రాలు వుండును. కొలెస్ట్రాలెక్కువైతే కొట్టుకునే గుండె అమాంతం ఆగిపోవడమో, ఆగి ఆగి కొట్టుకోవడమో జరుగును. ఆనక లైఫుఇన్సూరెన్సుపాలసీ వాడుకోవలసి రావచ్చును." " మోహము వలన క్రోధము కలుగునూ.." అంటూ లింకు చెప్పిన కృష్ణుడిలా చెప్పింది సావిత్రి. అదిరిపోయింది అరవింద.

"అదికాదే, మేము లిమిట్‌గానే తింటాము, ఆయన టెన్నీసూ గట్రా ఆడతారు కూడా" అంది సంజాయిషీగా.

"పి..హి..చ్చి..దానా, ఇలాగే 252 పిచ్‌ట్రీ సర్కిల్లో ఉండే అప్పారావుగారనుకున్నారు నెల్రకితం, ఇప్పుడు వాళ్ళావిడ ఉద్యోగం చేసి ఫామిలీని పోషిస్తోంది. ఆయనకి నిహిన్ననే బైపాసయ్యింది" అంటూ ఫ్రిజ్జు తలుపు తీసి మళ్ళీ కెవ్వుమంది.

"ఏహేవిటిది..ఏహేవిటిది" అంటూ కొండవీటిసింహంలో సీనియర్ ఎన్.టీ. ఆర్ లా అడిగింది, తల ఒక యాంగిల్లో పెట్టి, పాల కేను పట్టుకుని.

"పాలే, టూ పర్సెంటే కదా.." అంది అరవింద.

"353 రోజర్సు కార్నర్సు, వీరారెడ్డిగారు, హిల్లాగే, అహచ్చం హిల్లాగే... ఏ దురలవాట్లూలేవు, కనీసం కాఫీ కూడా తాగరు. రోజుకి నాలుగు సార్లు ఎక్సర్ సైజు చేస్తారు. "

"ఆఫీసుకెళ్ళరా?" అమాయకంగా అడిగింది అరవింద.

"మధ్యలో ఆపకు. ఆఫీసుక్కూడా సైకిలు మీదే వెడతారు. జస్టు రీసెంట్లీ వాళ్ళావిడ తాడు ఆల్ మోస్ట్ పుటుక్కుమంది.

"ఏవైనాఏక్సిడెంటా?"

"కహాదు, కహానే కహాదు, టూ పర్సెంటు, యెస్..టూ పర్సెంటు.."

"ఆయనకి టూ పర్సెంటు జీతం కూడా పెంచలేదా, అందుకే ఆత్మహత్య చేసుకోబోయారా, పాపం.."

"ఖాదు, ఆయన ఎప్పుడూ టూ పర్సెంట్ పాలే తాగుతారు. మొన్న గుండెలోనొప్పొస్తే, డాక్టర్ దగ్గిరకెళితే తెలిసింది, ఆయన గుండె వాల్వ్ టూ పెర్సెంటే తెరుచుకుంటున్నాయని, అంతే, అమాంతం పైకిలుమించి స్ట్రెచర్ మీదకి మోసేసి ఆపరేషన్ చేసేసారు."

"అయ్యో, ఫుల్ ఫేటు పాలు తాగితే పూర్తిగా తెరుచుకొనునేమో వాల్వ్." .

"ముయ్యి, నీకు నీ మనవలనీ మనవరాళ్ళనీ చూడాలని వుందా, లేదా" అడిగింది సావిత్రి ఆవేశంగా.

"ఉంది, కానీ ఇప్పుడు కొంచెం కష్టమేమో, కనీసం ఓ ముప్పైయేళ్ళన్నా ఆగాలికదే"

"అవును, కానీ మీరిలా తింటేముప్పై యేళ్ళు కాదుకదా,...ఎందుకులే, ఇలాతినడం చాలా డేంజరు, అందులోనూ ఈ దేశంలో".

చావుకి పెడితే లంఖణానికొచ్చినట్టయ్యింది అరవింద పని.

"నిజంగా అంత ప్రమాదమా" అడిగింది భయంగా.

'మరి, ఎన్ని చెప్పమంటావు, 132 స్టేట్ బ్రిడ్జి రోడ్డు, 687 విలియం హిల్ ట్రయిలు.." చెప్పుకుంటూ పోతోంది సావిత్రి.

"వద్దులేవే, అవన్నీ వద్దు, ఇప్పుడు నేనేంచెయ్యాలో చెప్పు "అంది దీనంగా అరవింద.

ఇంక రెచ్చిపోయింది సావిత్రి.

"ముందొక త్రాసు కొనుక్కో. నువ్వు రోజుకి పది గ్రాముల పప్పు, వంద మెతుకుల అన్నం మాత్రమే తినాలి. నూనె, నెయ్యి జాన్తానై. ఒక పెయింటు బ్రెష్షు కొనుక్కో. దానికి ఒక చుక్క నూనె అద్ది దాంతో వేపడం చెయ్యి. ఎప్పుడైనా డీప్ ఫ్రై కావాలంటే రెండు చుక్కలు అద్దు. సోయా పాలుగానీ, మేకపాలు గానీ తాగు. ఆర్గానిక్ మేకపాలైతే మరీ బెటర్. అసలు బంగాళదుంపల మాటే ఎత్తకు. బాగా ఎండిపోయి, పళ్ళల్లో గుచ్చుకునే పులకాలు తినండి. రోజూ రెండు సార్లు పరిగెత్తండి, బ్రసెల్ స్ప్రౌట్లు కూర చేసుకోండి.."

"అవి ఎలక చచ్చిన కంపు కుడుతోందన్నారు మా ఆయన ఓసారి వండితే, అందుకే మానేసాను" అంది అరవింద.

"ఎలకేకాదు, ఏనుగు చచ్చిన కంపు కుట్టినా సరే, ముక్కుకి క్లిప్పుపెట్టుకుని తినండి, పొద్దున్నే నానిన పెసలు తినండి, మధ్యాన్నం మాగిన పండ్లు తినండి, రాత్రి ఎండిన పులకాలు తినండి, ఇదే ఆరోగ్య సూత్రం".

ముందుహాల్లో సత్యం కూడా ఇదే ప్రవచనాన్ని వినిపిస్తున్నాడు సూర్యానికి.

"ఒరేయ్, నువ్వీమధ్య ఫిజికల్ చెకప్ కి వెళ్ళావా? నీ కొలెస్ట్రాలు నెంబర్సేవిటి?"

"ఏమోరా గుర్తులేదు, బానే వున్నాయన్నాడు డాక్టరు" అన్నాడు సూర్యం.

"వాళ్ళలాగే చెబుతార్రా. నువ్వు వెయిటు తగ్గాలి, తిండి మానెయ్యాలి, నేను గత రెండు నెలల్లో ముప్పై పౌండ్లు తగ్గాను".

"అదేవిట్రా, నీదెప్పుడూ హెల్దీ వైయిటేగా?"

"అయినా సరే తగ్గాల్సిందే రోజూ ఉదయం గోధుమ జావ తాగుతాను, మా తాత అదే తాగేవాడు పొలానికెళ్ళేముందు. మధ్యాన్నం గుగ్గిళ్ళు తింటాను, మా గుర్రబ్బండివాడు అదే పెట్టేవాడు గుర్రాలకి, సాయంత్రం ఉలవలు, రాత్రి పచ్చి శెనగలు..".

ఇల్లా ఉదరగొట్టేసారు సత్యం అండ్ పార్టీ. వాళ్ళెళ్ళేసరికి రాత్రైంది. దిగులుగా కూర్చున్నారు సూర్యం, అరవింద.

"అయితే మనపిల్లాడు పెరక్కుండానే మనం టపా కట్టేస్తావేమోనండీ, అప్పుడు వాడు అచ్చంగా పాపంపసివాడు సినిమాలోలా "అమ్మా చూడాలీ, నిన్నూ నాన్నను చూడాలీ.." అంటూ ఏడుస్తూ.."అంటూ కళ్ళమ్మటనీళ్ళెట్టుకుంది అరవింద.

"ఊరుకోవే, వాడు స్కూల్ట్రిప్పు నించి వచ్చే వేళయ్యింది. అయినామన ఫిజికల్ చెకప్ రిపోర్టులు బానే వున్నాయిగా, మనం అనవసరంగా భయపడుతున్నామేమో. వాళ్ళ మాటల్ని బట్టి చూస్తే వాళ్ళు కొంచెం "అతి" చేస్తున్నట్టుగా లేదూ? లేకపోతే లంచి టైములో ఫీసు బయట చెడ్డీలేసుకుని పరిగెత్తడం, ఇండియాలో కనీవినీ ఎరగని కూరలన్నీ ఇక్కడ తినడం, కూరలకి నూనె

పెయింటులు రాయడం, సోయపాలంటూ సోయగాలు పోవడం, ఇవన్నీ మహా అతి. ఏదో, కావలసినవి మోతాదులో తింటూ, ఓ ఆటో, కాస్త వాకింగో చేస్తూ, మనసులో ఏ టెన్షన్లూ లేకుండా బతికితే చాలదూ?" అన్నాడు సూర్యం.

"చాలదేమో.." అంది అరవింద బెంగగా.

ఆ మర్నాటినించీ వాళ్ళుపడ్డ కష్టాలు పగవాడిక్కూడా వద్దు. ఒక వారం రోజుల్లో ఇద్దరూ మొహాలు పీక్కుపోయి మోడుల్లా తయారయ్యారు. అంగనలింపులేరు, వరి అన్నము మాటలేదు, బంగాళదుంపల ఊసే లేదు. ఎందుకు సంపాదిస్తున్నామో, ఎందుకు బతుకుతున్నామో అర్థం కాలేదు సూర్యానికి. పైకి చెప్పట్లేదుకానీ, అరవింద పరిస్థితీ అల్లాగే వుంది.

ఆ శనివారం మధ్యాన్నం, తినాల్సిన వంద మెతుకులూ పూర్తిచేసి, కంచాల్లో చేతులు పెట్టుకుని ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ, ఈసురోమని కూర్చున్నారు దంపతులు. మళ్ళీ ఫోనొచ్చింది. సత్యం మొన్న ఫిజికల్ చేయించుకున్నాట్ట. కొలెస్ట్రాలు చాలా ఎక్కువ ఉందిట, స్ట్రెస్సే కారణమని చెప్పేసాట్ట డాక్టరు. బాగా ఆరోగ్యంగా బతకాలనే ఆతృతలో, అతి చేయడంవల్ల స్ట్రెస్సు ఎక్కువైపోయి, తిన్న వంద మెతుకులూ అరక్క, సోయపాలు లోపలే స్టోరైపోయి, కొలెస్ట్రాలు పెరిగిపోయిందిట. అదీ ఫోనుకాలు సారాంశః.

వెంఠనే సూర్యం భార్యకి చెప్పేసి, సాయంత్రం సత్యం వాళ్ళింటికి కర్టెసీ విజిట్ ప్రోగ్రాం ఎరేంజి చేసేసి, ఇనాగరల్ స్పీచికి ప్రిపేరవడం మొదలెట్టాడు. గ్రహణం విడిపోయిన సూర్యుడిలా వెలిగిపోతోంది సూర్యం మొహం. బ్రసెల్ స్ప్రౌట్స్‌తో కాస్త దిష్టితీసి, బంగాళ దుంపలు తరగడం మొదలెట్టింది అరవింద. ప్రాణం లేచొచ్చింది సూర్యానికి.

"చిన్ని నా బొజ్జకూ శ్రీరామ రక్ష (చి.బొ.శ్రీర )' అనుకున్నాడు సూర్యం ఆనందంగా!!

